క్లుప్తంగా

సమాచారం లేకుండా విద్యుత్ కోతలు

ధన్వాడ: ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ధన్వాడ మండల కేంద్రంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో వ్యాపారస్తులు, ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఇబ్బందులు గురయ్యారు. విద్యుత్ నిలిపివేసే ముందు కనీస సమాచారం అందిస్తే అందుకు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డారు. ఇలాంటిది పునరవృతవం కాకుండా విద్యుత్‌శాఖ అధికారులు చూసుకోవాలని వ్యాపారస్తులు, ప్రజలు కోరుతున్నారు.

పద్మశాలీల సమావేశం విజయవంతం చేయండి

ధన్వాడ: హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించనున్న పద్మశాలి మహాసభను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉదయభాను పిలుపునిచ్చారు. శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మహాసభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారని, జిల్లాలోని అన్ని మండలాల పద్మశాలీలు ఉదయం 10 గంటల లోపు అందరూ హైదరాబాద్ చేరుకోవాలని కోరారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



అమరచింత: మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ నిధులతో పట్టణంలోని ఏడో వార్డులో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నామని బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య తెలిపారు. బీసీ కాలనీలోని ఏడో వార్డులో బొడ్రాయి సమీపంలో నూతనంగా హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని కాలనీవాసుల వినతి మేరకు ఎంపీ డీకే అరుణ నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. పట్టణంలో మూడు ప్రదేశాల్లో ఒకొక్కటి రూ.2 లక్షల చొప్పున వెచ్చించి ప్రజా అవసరాల మేరకు హైమాస్ట్ లైట్లు బిగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంగ అంజి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పొలం విషయంతో ఘర్షణ.. రిమాండ్‌కు తరలింపు


ధరూరు: పొలం పంచాయితీ విషయంలో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి గాయపడగా, ఇరువురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. మండల పరిధిలోని దోర్నాల గ్రామానికి చెందిన నర్సింహులుపై పాత కక్షలు మనసులో పెట్టుకుని ఈనెల 6న గ్రామానికి చెందిన వాసు, కృష్ణ దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దాడికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



అయిజ: కాంగ్రెస్ నాయకులు ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కల్లిబొల్లి మాటలు చెబుతున్నారని, హామీలు నెరవేర్చకుంటే నిరసన సెగలు తప్పవని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు రూ. 2,500 ఆర్థిక సహాయం, విద్యార్థినులకు స్కూటీ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మహిళలకు ఇచ్చిన హామీలు నేరవేర్చకుంటే ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భీమసేనరావు, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం రాయచూర్ జిల్లా యాపల్‌దిన్నె గ్రామానికి చెందిన ఉమేష్ నూతన కల్యాణ మండప నిర్మాణానికి రూ.21 వేలు విరాళం అందజేశాడు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.



ధన్వాడ కేక్ కట్ చేస్తున్న మహిళలు



కోస్గిలో తపస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు



కోస్గిలో జూనియర్ సివిల్ జడ్జి ఫర్వీన్‌బేగం కు పుష్పగుచ్ఛం అందిస్తున్న న్యాయవాదులు

మహిళా సాధికారతే ముఖ్యం

సాక్షి, నెట్‌వర్క్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలు, మండల కేంద్రాల్లో మహిళా ఉద్యోగులు, అంగన్‌వాడీలు, మహిళా సంఘాల సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళా సాధికారతకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళలు, బాలికలపై వేధింపులు నిర్మూలించేందుకు పటిష్ట చట్టాలు తేవాలని కోరారు.

■ నారాయణపేట జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో మహిళలు కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ శివారెడ్డి, వైస్ చైర్మన్ కొనంగేరి హన్మంతు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ తదితరులు పాల్గొన్నారు.

■ నారాయణపేట ఆర్టీసీ డిపోలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు మహిళా కండక్టర్లను డీఎం లావణ్య శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఐ అలివేలమ్మ, ఏంఎఫ్ చంద్రనాయక్, సూపరింటెండెంట్ నరేందర్, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

■ మక్తల్ పట్టణంలో మార్కెట్ చైర్‌పర్సన్ గవినోళ్ల రాధమ్మ, మున్సిపల్ మహిళా కార్మికులు, ఉపాధ్యాయినులు, మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలోనర్సింహాగౌడ్, గణేష్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, చంద్రశేఖర్, ఫయాజ్, శ్రీనివాసులు, ఎంఈఓ అనిల్‌గౌడ్, రాజుల ఆశిరెడ్డి, చిన్నహన్మంతు, రవికుమార్ పాల్గొన్నారు.

■ మరికల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హరీశ్ ఆధ్వర్యంలో, అప్పంపల్లి, తీలేర్, పస్పుల, కన్మనూర్, జిన్నారం, ఎలిగండ్ల, మాద్వార్ తదితర గ్రామాల్లో మహిళా కార్మికులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్యామ్ సుందర్‌రెడ్డి, హరీశ్, వీరన్న, గోపాల్, రామకృష్ణ, చెన్నయ్య, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్, మల్లయ్య, వినితమ్మ పాల్గొన్నారు.



మక్తల్‌లో డాక్టర్లను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

■ కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణారావు ఆధ్వర్యంలో మహిళల హక్కుల గురించి అవగాహన కల్పించారు. మండలంలోని వీరారం, పలు గ్రామాల్లో ఎంపీఓ రామన్న అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలకు శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

■ కృష్ణా మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు మారెమ్మ, కార్యదర్శి శంకరమ్మ అధ్వర్యంలో కేక్‌కట్ చేసి, కున్సీ గ్రామంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో మహిళా సంఘం సభ్యులను పూలమాల, శాలువలతో సన్మానించి, వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

■ కోస్గి పట్టణంలోని జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కార్యాలయంలో జూనియర్ సివిల్ జడ్జి ఫర్వీన్‌బేగం కు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓం ప్రకాశ్, న్యాయవాదులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రభాకర్‌గౌడ్, ఆనంద్, కరుణాకర్, రాములు, రాజలింగం, భీమేష్, తాజ్ రాజురెడ్డి తదితరులు ఉన్నారు.

■ మాగనూర్ పంచాయతీ కార్యాలయంలో గ్రామ మహిళ సంఘం అధ్యక్షురాలు వెంకటమ్మ, పద్మతో సభ్యులను, పంచాయతీ మహిళా కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహిళ సంఘం ఏపీఎం గంగాధర్, సీసీ, వీఓఏ తదితరులు పాల్గొన్నారు.

■ ధన్వాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆశాకార్యకర్తలు, వైద్యసిబ్బంది, ఐకేపీ సంఘాలు, ఉపాధి హామీ కూలీలను కాంగ్రెస్ నాయకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, నరహరి, రేణుక, రహీమన్‌ఖాన్, రాంచంద్రయ్య, నరేందర్‌గౌడ్, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ధన్వాడ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మెర్సి వసంత ఆధ్వర్యంలో మహిళా అధ్యాపకులను సన్మానించారు.

■ కోస్గి, గుండుమాల్ మండలాల తపస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్ ఆధ్వర్యంలో మహిళలకు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా సమన్వయకర్త రామకృష్ణారెడ్డి, వెంకట్‌రాములు, వెంకటేష్, ఆంజనేయులు, ఆనంతయ్య, గిరిజ, స్వప్న, వసంత, సునీత, శైలజ, ఉమాదేవి, సంధ్యారాణి, పద్మావతి, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.



కృష్ణాలో..

■ మద్దూరు మండలంలోని నాగిరెడ్డిపల్లిలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 94 ఏళ్ల వృద్ధురాలు ఈడిగి బసమ్మ సన్మానించారు. గ్రామంలో పాఠశాల నిర్మాణానికి భూమిని దానం చేశారని, అలాగే బీసీ కాలనీ నిర్మాణం కోసం అప్పట్లో నామమాత్రపు డబ్బులకు 3 ఎకరాల భూమి అందించారని కొనియాడారు. పెదిరిపాడ్, మద్దూరు, తదితర గ్రామాల్లో మహిళా కార్మికులకు సన్మానించారు. కార్యక్రమంలో బస్వరాజ్, విశ్రాంత ఉపాధ్యాయుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.



మాగనూర్‌లో..



మక్తల్‌లో తపస్ ఆధ్వర్యంలో..



అప్పంపల్లిలో..

'పెద్ద చెరువు ఆనకట్ట కింద నిర్మాణాలు కూల్చివేయాలి'



కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

మరికల్: నిబంధనలకు విరుద్ధంగా పెద్ద చెరువు (మినీ ట్యాంకు బండ్) కింద నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయించాలని శనివారం కాంగ్రెస్ నాయకులు ర్యాలీగా వెళ్లి పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు వీరన్న, పట్టణ అధ్యక్షుడు హరీశ్ మట్లాడుతూ పెద్ద చెరువు అలుగు కాల్వతో పాటు ఆనకట్ట కింద స్థలం కాపాడాలని కార్యదర్శికి సూచించారు. గత వర్షాకాలంలో పెద్ద చెరువు నిండి వరద నీరు జాతీయ రహదారిపైకి రావడంతో పది రోజుల పాటు ప్రజలు, వాహనాదారులు తీవ్రంగా ఇబ్బందులకు గురైనా అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఇరిగేషన్, పంచాయతీ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టిన చెరువు ఆనకట్టు అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని లేకుంటే ఆందోళన తప్పందన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, హరీశ్, వినితమ్మ, గోపాల్, రామకృష్ణ, రాజు, చెన్నయ్య, ఆంజనేయులు, తిర్మలయ్య, రఘు పాల్గొన్నారు.

హోజమ్మకు సన్మానం



మక్తల్: తెలంగాణ యునైటెడ్ క్రిస్టమస్ అండ్ పాస్టర్స్ అసోషియేషన్ హైదరాబాద్‌లో ఆధ్వర్యంలో ఊట్కూర్‌కు చెందిన జిల్లా జోగిని వ్యతిరేఖ పోరాట సమితి జిల్లా కన్వీనర్ హోజమ్మ, సోషల్ వర్కర్లు మారుతమ్మ, జయశీల ను శాలువాతో ఘనంగా సన్మాంచి, అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్తేర్ ప్రియాంక గొల్లపల్లి, సుమన్ తల్వార్, రోహిణినాయుడు, హేమలత, షాలిని డానికల్, తిమోతీ, సోలమెన్‌రాజు పాల్గొన్నారు.

పూసల్‌పహాడ్ టాలెంట్ టెస్ట్ విజేతలకు అభినందన



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఉమ్మడి జిల్లా యువజన అధికారి కోటనాయక్

మరికల్: ఇటీవల నిర్వహించిన పూసల్‌పహాడ్ టాలెంట్ టెస్టులో మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నెహ్రూ యువ కేంద్రం యువజన అధికారి కోట నాయక్, ఎస్‌ఐ రాము ప్రశంసాపత్రాలను అందజేశారు. యువక మండలి భవనంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో టాలెంట్ టెస్టులో మండల టాపర్‌గా నిలిచిన భారతి ఉన్నత పాఠశాల విద్యార్థి పూజిత పాటు అధిక మార్కులు సాధించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులను వారు సన్మానించారు. అలాగే మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యువక మండలి అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసులు, సూర్యప్రకాష్, ఆంజనేయులు, రవి, కిరణ్, కొండయ్య, చెన్నయ్య, నవీన్, అశోక్, వెంకటేష్, రాఘవేందర్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నారాయణపేట ఎడ్యుకేషన్: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖేలో ఇండియా అథ్లెటిక్ కోచ్ హారిక దేవి పాల్గొని మాట్లాడారు. మహిళలు చదువులతో పాటు క్రీడల వంటి అనేక రంగాల్లో రాణించాలన్నారు. పురుషులతో సమానంగా మహిళలకు ప్రాధాన్యం లభించినప్పుడే మహిళ సాధికరత సాధించేందుకు సులభతరం అవుతుందన్నారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సిబ్బంది అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా హారిక దేవిని శాలువాతో సన్మానించారు. తదనంతరం పరుగు పందెంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రెటరీ రమణ, కరాటే మాస్టర్ అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఈతవనం.. అడుగడుగునా నిర్లక్ష్యం

- రక్షణ లేక వాడుతున్న మొక్కలు

అమరచింత: గ్రామాల్లో ఈత వనాలను పెంచి ప్రజలకు స్వచ్ఛమైన కల్లును అందించాలనే సంకల్పంతో గత ప్రభుత్వం ఈత వనాల విస్తరణపై చర్యలు తీసుకుంది. కానీ వాటిని అమలు పర్చడంలో అధికారులు అలసత్వం చూపడంతో ఈత వనాల లక్ష్యం నీరుగారుతోంది. అమరచింత మండలంలోని పాంరెడ్డిపల్లి శివారులో సర్వే నంబర్ 55బై ఉ1, 2, 3 లలో 8 ఎకరాల వ్యవసాయ పొలంలో అమరచింత కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేశారు. వీటిలో ఈత మొక్కలను పెంచడంతో తమకు ఉపాధి లభిస్తుందని గీత కార్మికులు 4 వేల మొక్కలు నాటారు. అప్పటి ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో వీటి సంరక్షణను ఈజీఎస్‌కు అప్పగించింది. మొక్కలకు డ్రిప్ ద్వారా నీటిని అందించాలంటే వాటిలో బోరు వేయడం, రక్షణ కంచె కోసం నిధులు ఇవ్వాలని గీత కార్మికులు అప్పటి ఎమ్మెల్యేకు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో సొసైటీ ద్వారానే రూ.1.75 లక్షలు ఖర్చుచేసి వాటికి ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నా.. సరైన సమయంలో నీరు అందకపోవడంతో ఎండుముఖం పడుతున్నాయి. ప్రస్తుతం 4 వందల ఈత మొక్కలు మిగిలాయని, వీటి సంరక్షణ కోసమైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గీత కార్మికులు కోరుతున్నారు.



ఈత వనంలో నీరు లేక వాడుముఖం పడుతున్న మొక్కలు

ప్రహరీ నిర్మించండి సారూ..



మాగనూర్: విద్యావ్యవస్థ పటిష్టతకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా.. విద్యార్థుల సమస్యలు మాత్రం తీరడం లేదు. ఒక్కవైపు సరిపడా ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడుతుంటే మరోవైపు పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు ప్రహరీలు నిర్మించాలనే ప్రతిపాదనలు ఏళ్ల తరబడి కాగితాలకే పరిమతమవుతున్నాయి. మండలంలోని తళంకేరి గ్రామ శివారులో పాఠశాల ఉండటంతో మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. దీంతోపాటు విద్యార్థులు, ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజన సమయంలో పందులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అల్వాల గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ గుడిసె దగ్ధమైన ఘటన శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గొల్ల నక్క అంజనమ్మ బతుకుదెరువు కోసం గ్రామంలో మేకలను పెంచుతూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. శనివారం పెబ్బేరు సంతకు వెళ్లి మరికొన్ని మేకలు తెచ్చుకుందామని గ్రామంలోని ఓ వ్యక్తితో రూ.లక్ష అప్పు తెచ్చుకుంది. మధ్యాహ్నం వరకు మేకలను మేపుకొని వచ్చి పెబ్బేరు సంతకు వెళ్దామని ఇంటికి రాగా అప్పటికే గుడిసెలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో స్థానికులు మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. మంటలు అదుపులోకి వచ్చిన తర్వాత ఇంట్లోకి వెళ్లి చూడగా మేకలను తీసుకొచ్చేందుకు అప్పుగా తీసుకొచ్చిన రూ.లక్ష మంటల్లో కాలిపోవడంతో పాటు ఇంటి సామగ్రి, బియ్యం, దుస్తులు కాలిపోనట్లు బాధితురాలు వాపోయింది. గ్రామానికి చెందిన కొందరు తక్షణసాయంగా బియ్యం, కొంత నగదు ఆర్థికసాయాన్ని బాధితురాలికి అందజేశారు.

ఈద్గా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఈద్గా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రంజాన్ పండుగను దృష్టిలో పెట్టుకొని పనులను ముమ్మరం చేయాలని ఈద్గా కమిటీ సభ్యులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, మాజీ కౌన్సిలర్ రాషెద్‌ఖాన్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ప్రవీణ్‌కుమార్, పులిజాల రవికిరణ్, తులసిరామ్ పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

రాజీయే రాచమార్గం

- అదనపు కోర్టు న్యాయమూర్తి ముద్దసిర్‌అలీ

జడ్చర్ల టౌన్: రాజీయే రాచమార్గమని జడ్చర్ల అదనపు కోర్టు న్యాయమూర్తి ముద్దసిర్‌అలీ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కక్షిదారులు పరస్పర వైరుధ్యాలు మానుకొని రాజీమార్గం ఎంచుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. లోక్‌అదాలత్ ద్వారా రాజీ చేసుకుంటే భవిష్యత్‌లో మళ్లీ కేసులు వేయటానికి వీలు లేకుండా ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లో 585కేసులు పరిష్కారమైనట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య తెలిపారు. రెండవ తరగతి కోర్టు ద్వారా 462 కేసులు పరిష్కారం అయ్యాయన్నారు. వీటిలో 5బ్యాంక్ కేసులు, ఎస్‌ఐ యాక్ట్ 1, ఎక్సైజ్ 11, అడ్మిషన్స్ 65, సివిల్ 1, క్రిమినల్ 40 కేసులు ఉన్నాయన్నారు. న్యాయవాదులు మహేశ్వర్‌రెడ్డి, తిరుపతి, యాదిరెడ్డి, రమేష్, శ్రీనివాస్‌గౌడ్, కరీం, ఇఫ్తెకార్, రాములు, విశ్వేశ్వర్‌తోపాటు కోర్టు సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కోర్టు న్యాయమూర్తి ముద్దసిర్‌అలీ

లోక్ అదాలత్‌లో 2,879 కేసులు..

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో పోలీస్ శాఖ నుంచి 2879 కేసులు రాజీ అయినట్లు ఎస్పీ జానకి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన ఐపీసీ కేసులు 407, డ్రంకన్‌డ్రైవ్, ఎంవీఐ యాక్ట్, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనలు 793, ఈపెట్టీ, బహిరంగ మద్యపానం 1679 కేసులు రాజీ చేసినట్లు పేర్కొన్నారు. 15రోజుల నుంచి పోలీస్ అధికారులు, సిబ్బంది నేరుగా కక్షిదారులను కలిసి రాజీ చేసుకోవడానికి అవగాహన కలిగించినట్లు వెల్లడించారు. త్వరలో కోర్టు సిబ్బందికి, మానిటరింగ్ చేసిన పోలీస్ అధికారులకు రివార్డ్స్ అందిస్తామని పేర్కొన్నారు.

నేడు మల్లికార్జునస్వామి రథోత్సవం

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ శివారులో శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి రథోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి బిల్వార్చన, పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ సముదాయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. రథాన్ని వేడుకలకు ముస్తాబు చేస్తున్నారు.



ఉత్సవానికి ముస్తాబవుతున్న రథం